RNI NO.APTEL/2013/49614

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నర్సుటిల్ కాలదుతూ ఆంధ్రప్రజలందరి మన్ననలను పొందుతున్న రాజనీతి దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్
మొబైల్: 9618501530

శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 సంచిక : 170 అన్నమయ్య జిల్లా చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ బుధవారం 01 జూలై 2026 పేజీలు : 04 వెల : రూ. 2/-




అమరావతి: ఆంధ్రప్రదేశ్ గనుల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఖనిజ వనరుల ద్వారా ఆదాయాన్ని గరిష్ఠంగా పెంచేందుకు ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము వంటి ఖనిజాలను కేవలం తవ్వడమే కాకుండా, రాష్ట్రంలోనే వాటికి విలువ జోడింపు ప్రక్రియ చేపట్టడం ద్వారా గరిష్ఠ రెవెన్యూ సాధించవచ్చని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం మార్కెట్ క్యాపిటలైజేషన్ అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభించే అరుదైన ఖనిజాల కోసం ఒక ప్రత్యేక 'రేర్ ఎర్త్ క్లస్టర్' ఏర్పాటును సీఎం ప్రతిపాదించారు. ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాల్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా సాగాలని, అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి ఇసుక రీచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, శాటిలైట్ నిఘా, జీపీఎస్ ట్రాకింగ్ వంటి అధునాతన సాంకేతికతను వాడాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే 126 వ్యూహాత్మక ఖనిజ నిక్షేప ప్రాంతాలను గుర్తించామని, ప్రస్తుతం గనుల ఆదాయం 18% పెరిగిందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్.




హైదరాబాద్ : జూన్ 30: వానాకాలం సీజన్ కోసం రైతు భరోసా నిధులను విడుదల చేశారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం (జూన్ 30) హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన రైతు భరోసా సదస్సులో నిధులు విడుదల చేశారు.తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయల పంపిణీ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటి దశలో 2 ఎకరాల లోపు ఉన్న రైతుల అకౌంట్లో నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులందరికీ దశలవారీగా ఈ పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతు అకౌంట్లో ఎకరాకు 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందించే క్రమంలో.. తొలి విడత రెండు ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల ఏశారు. తెలంగాణలో మొత్తం 73.32 లక్షల మంది రైతులకు ఈ సాయం అందనుంది. మొదటి దశలో భాగంగా ఎకరాకు రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. మొదటి విడతలో 2 ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేశారు. రైతు భరోసా ఆర్థిక సాయం కోసం కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. తమ వివరాలను సమీప వ్యవసాయ విస్తరణ అధికారికి (ఏఈఓ) జూలై 5వ తేదీలోపు అందజేయడం ద్వారా ఈ పథకానికి అర్హులు అవుతారు. నిధుల విడుదలపై పూర్తి వివరాలు, ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకోవడానికి అధికారిక పోర్టల్‌లను లేదా మీ గ్రామ వ్యవసాయ అధికారిని సంప్రదించవచ్చు

## ముంబై కోకిలా బెన్ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్యపరీక్షలు... వెంటనే శస్త్రచికిత్స చేయాలన్న డాక్టర్లు



అమరావతి జూన్ 30: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఆయన చేతి కండరాలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే సర్జరీ చేయాలని సూచించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించిన అధికారిక కార్యక్రమాలు, పరిపాలనా విధులు పూర్తయిన తర్వాతే తాను శస్త్రచికిత్స చేయించుకుంటానని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సోమవారం నాడు తన భార్య అన్నా లెజినోవాతో కలిసి పవన్ ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌కు వైద్య పరీక్షలు పూర్తయ్యాయి. ఆయన రెండు భుజాలను క్షుణ్ణంగా పరీక్షించిన వైద్య బృందం, రొటేటర్ కఫ్‌తో పాటు చేతికి సంబంధించిన రెండు కండరాలకు తీవ్ర గాయమైనట్లు గుర్తించింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నందున, తక్షణమే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆయనకు పూర్తి నివేదికను అందజేశారు. అయితే, వైద్యుల సూచనపై స్పందించిన పవన్ కల్యాణ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. ముందుగా నిర్దేశించుకున్న ప్రభుత్వ కార్యక్రమాలను, పరిపాలనా బాధ్యతలను పూర్తి చేయడం తన కర్తవ్యమని ఆయన భావించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తర్వాతే శస్త్రచికిత్స కోసం ఆసుపత్రిలో చేరతానని తెలిపారు. ఈ మేరకు అధికారిక కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వస్తానని ఆయన పేర్కొన్నారు. కాగా, పవన్ కల్యాణ్ గత కొంతకాలంగా చేతి నొప్పితో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. రెండు చేతుల కండరాలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు, రొటేటర్ కఫ్ గాయంతో ఆయన అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పి ఆయన్ను వేధించింది

## విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము: ఘనస్వాగతం పలికిన మంత్రి లోకేష్



విశాఖపట్నం : భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము జూన్ 30న విశాఖపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో మంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్.. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌తో కీలక సమావేశం నిర్వహించారు. జూన్ 30న జరిగిన ఈ భేటీలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన పలు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై చర్చించారు. తూర్పు కనుమల పరిధిలో పులుల సంరక్షణకు తీసుకోవాల్సిన ఉమ్మడి చర్యలపై ఇరు రాష్ట్రాల నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల అభివృద్ధిలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడపులులను అందించేందుకు అంగీకరించింది. ఈ సానుకూల నిర్ణయం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. దేవేంద్ర ఫడ్నవీస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## పారిశ్రామిక రంగంలో ఏపీ ఊహించని ప్రగతి: మంత్రి టీజీ భరత్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఊహించని ప్రగతిని సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ టీజీ భరత్ స్పష్టం చేశారు. స్పేస్, డ్రోన్ సిటీల అభివృద్ధి నుంచి గ్రీన్ హైడ్రోజన్ రంగం వరకు రాష్ట్రం ఎంతో పురోగతి సాధిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో అత్యుత్తమ అభివృద్ధిని నమోదు చేసిందని మంత్రి వివరించారు. 2019 నుండి 2024 వరకు ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల సంఖ్య పూర్తిగా పడిపోయిందని, ఆ కాలంలో పారిశ్రామిక వృద్ధి కుంటుపడిందని మంత్రి టీజీ భరత్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రధాని మోడీకి ఫోన్ చెయ్.. అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో డోనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు



వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య ఉన్న బలమైన స్నేహ బంధాన్ని చాటిచెప్పే ఒక ఆసక్తికర సంఘటనను అమెరికా రాయబారి సెర్జియో గోర్ ఇటీవల వెల్లడించారు. అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య లీడర్‌షిప్ సమిట్ వేదికగా ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న మయామిలో జరిగిన 'గాలా 327' ఈవెంట్ సందర్భంగా.. ప్రధాని మోడీకి ఫోన్ చేయాలని ట్రంప్ అనుకున్నారు. ఆ సమయంలో భారత్‌లో ఉదయం 6 గంటలు అవుతుందని, అది సరైన సమయం కాదని రాయబారి సెర్జియో గోర్ గుర్తుచేశారు. రాయబారి వారించినప్పటికీ ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. "మోడీ ఈపాటికే మేల్కొని ఉంటారు, ఆయన కూడా నాలాగే చాలా తక్కువ సమయం నిద్రపోతారు" అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు గోర్ తెలిపారు. అయితే, ట్రంప్ స్టేజీ పైకి వెళ్లాల్సి రావడంతో ఆ కాల్ మరుసటి రోజుకు షెడ్యూల్ చేయబడింది. నిజమైన స్నేహం ఉన్నప్పుడు ప్రతి విషయానికి షెడ్యూల్స్ అవసరం లేదని ఈ ఘటన నిరూపిస్తోందని గోర్ పేర్కొన్నారు. ప్రపంచంలోని ఇతర నేతలతో ట్రంప్ కేవలం అధికారికంగానే వ్యవహరిస్తారని, కానీ ప్రధాని మోడీతో ఆయనకు ప్రత్యేకమైన అభిమానం మరియు అనుబంధం ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

# మహిళా భద్రతకు రంగంలోకి 'షీ నేత్ర టీమ్స్'

హైదరాబాద్ జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): హోటళు ,, మాల్స్, హాస్టళ్లు, సినిమా హాళ్లు, విద్యా సంస్థలతోపాటు.. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టు రట్టు చేసేందుకు పోలీసు విభాగం సరికొత్త అస్త్రం షీ నేత్రను రంగంలోకి దింపింది. అత్యాధునిక కెమెరాలు, డిటెక్టర్లతో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్.... హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు, సినిమా హాళ్లు, విద్యా సంస్థలతోపాటు.. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టు రట్టు చేసేందుకు హైదరాబాద్ పోలీసు విభాగం సరికొత్త అస్త్రం షీ నేత్రను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. నిఘా కెమెరాల ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా 'షీ నేత్ర' టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ -10న సిటీ కమిషనరేట్ పరిధిలోని ఏడు జోన్లకు ఒక్కో బృందం చొప్పున మొత్తం ఏడు ప్రత్యేక షీ నేత్ర టీమ్‌లు ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ కొనసాగించారు. అందులో భాగంగా అత్యాధునిక కెమెరాలు, డిటెక్టర్ల వినియోగం, నిబంధనల ఎస్‌వోపీపై రెండు దశల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో షీటీమ్స్ బృందాలు షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్ రూమ్‌లు, ఆస్పత్రులు, హోటళ్లు, హాస్టళ్లలో రహస్యంగా కెమెరాలు అమర్చి మహిళల గోప్యతకు భంగం కలిగించే ఘటనలపై ఉక్కుపాదం మోపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఈ ఏడు బృందాల ద్వారా నగరవ్యాప్తంగా ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయని సీపీ తెలిపారు. తమ ప్రాంగణాల్లోని ప్రైవేటు ప్రదేశాల్లో రహస్య కెమెరాలు లేవని నిర్ధారించుకోవాల్సిన పూర్తి బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ తప్పనిసరిగా 'కస్టమర్స్ సేఫ్టీ ఇన్ చార్జీ'ని నియమించుకోవాలని, వీరు షీ టీమ్స్‌కు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలని సూచించారు. మహిళల భద్రత సమిష్టి బాధ్యతని, ప్రజలు ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులను గుర్తిస్తే వెంటనే డయల్ 100/112 లేదా షీ టీమ్స్ నంబర్ 9490616555కు సమాచారం అందించాలని సీపీ వెల్లడించారు

# సూపర్వైజర్--స్టాఫ్ నర్సుల వాగ్వాదం ఘటనపై వెంటనే స్పందించిన జిల్లా వైద్యశాఖ.



కమలాపురం జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లా ప్రోగ్రామ్ నిర్వహణ అధికారి డాక్టర్ మహమ్మద్ తాహా, జాతీయ అంటువ్యాధి నియంత్రణ మరియు ఆరోగ్య కార్యక్రమాల అధికారి డాక్టర్ ఆరిఫుల్లా కమలాపురం మార్కెట్ యార్డ్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బందిని విడివిడిగా ప్రశ్నించి పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం హాజరు పట్టికలు, సెలవు దరఖాస్తులు, విధుల నిర్వహణ రికార్డులు, ప్రయోగశాల, ఔషధ విభాగానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అలాగే ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను నమోదు చేసే ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డుల లక్ష్యాల పురోగతిని కూడా సమీక్షించారు. విచారణ అనంతరం విధి నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు, సేవా నియమాలు, కార్యాలయ క్రమశిక్షణను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పాటించాలని అధికార యంత్రాంగం ఆదేశించింది

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి.



ఆసిఫాబాద్ జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కుల పంపిణీ చేసిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మి ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్వయంగా అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు మొత్తం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "పేద ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఆర్థికంగా చితికిపోకూడదనే గొప్ప ఆశయంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసిన నిరుపేదలకు ఈ చెక్కులు ఎంతో ఊరటనిస్తాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు వేలాది మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించాం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన 15 రోజులలోపు దరఖాస్తు చేసుకుంటే త్వరగా మంజూరు అవుతుంది. దళారులను నమ్మి మోసపోవద్దు" అని సూచించారు.

# డిప్యూటీ సీఎం ఓఎస్డీగా కే. వెంకట కృష్ణకు మళ్లీ అవకాశం

అమరావతి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ ముఖ్యమంత్రికి అదనపు కార్యదర్శి (ూాం-నథఅశీఖశ్రీ ూవఎతీమ్ఖతీఎ) మరియు ప్రత్యేక విధుల అధికారి (ూాణ)గా పనిచేస్తున్న కే. వెంకట కృష్ణను మరో మూడేళ్లపాటు అదే బాధ్యతల్లో కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం జూలై 1, 2026 నుంచి అమల్లోకి రానుంది. సోమవారం సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్-ఏ) జారీ చేసిన జీఓ ఆర్టీ నెం.1282 ప్రకారం, డిప్యూటీ ముఖ్యమంత్రి కార్యాలయం సమర్థవంతంగా పనిచేయడానికి కే. వెంకట కృష్ణ సేవలు అవసరమని డిప్యూటీ సీఎం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలో ఉన్న కే. వెంకట కృష్ణ జూన్ 30, 2026న పదవీ విరమణ చేయనున్నారు. అయితే పదవీ విరమణ అనంతరం కూడా ఆయనను డిప్యూటీ ముఖ్యమంత్రికి అదనపు కార్యదర్శి, ఓఎస్డీగా తిరిగి నియమించారు. ఈ నియామకం 2026 మూడేళ్లు లేదా డిప్యూటీ ముఖ్యమంత్రి పదవీకాలం పూర్తయ్యే వరకు, ఏది ముందైతే అది వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి పరిధిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,పర్యావరణం అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు సంబంధించిన వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఈ పునర్నియామకాన్ని మంజూరైన పీఎస్/ఓఎస్డీ పోస్టుకు వ్యతిరేకంగా చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందుకోసం పునర్నియామకాలకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.60 (జూలై 29, 2024)లోని నిబంధనలకు సడలింపు ఇచ్చింది. వేతనం, ఇతర భత్యాలు ఆర్థిక శాఖ జీఓ ఎంఎస్ నెం.48 (ఏప్రిల్ 23, 2018) ప్రకారం అమలు చేయనున్నట్లు పేర్కొంది. చివరిగా పొందిన వేతనం నుంచి పెన్షన్ మొత్తాన్ని మినహాయించి ఆయనకు జీతభత్యాలు చెల్లించనున్నారు. ఈ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. గవర్నర్ పేరుతో ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు

# వాట్సప్ ద్వారా ఆధార్ కార్డు డౌన్‌లోడ్ చేయడమెలాగో తెలుసా?




వైస్సార్ జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): ప్రభుత్వ సేవలు, ఆర్థిక కార్యకలాపాలకు అత్యంత కీలకమైన ఆధార్ కార్డును ఇకపై వాట్సాప్ ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ అధికారిక **MyGov** హెల్ప్‌డెస్క్ చాట్‌బాట్‌ను ఉపయోగించి, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్, యాక్టివ్‌గా ఉన్న డిజిలాకర్ ఖాతా సహాయంతో సెకన్లలో ఆధార్‌ను **PDF** ఫార్మాట్‌లో పొందవచ్చు. దీని కోసం 9013151515 నంబర్‌ను కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకుని, చాట్ ప్రారంభించి, 'డిజిలాకర్ సర్వీసెస్' ఆప్షన్ ఎంచుకుని, ఆధార్ నంబర్, **OTP** ఎంటర్ చేస్తే సరిపోతుంది. ఈ సదుపాయం ద్వారా అదనపు యాప్‌లు అవసరం లేకుండానే ఆధార్‌ను సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

# "ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి": సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్




పులివెందుల: జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): 30-06-2026 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేసి రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ బుక్స్ గోడౌన్ల సీజ్



ఖమ్మం జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): ఖమ్మం నగరంలోని మమతా రోడ్ వద్ద శ్రీ చైతన్య స్కూల్ లో విద్యాశాఖ అధికారుల ఆకస్మిక దాడులు.విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో వెంటనే స్పందించిన అడిషనల్ కలెక్టర్, డీఈవో ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో రెండు పుస్తకాల గోడౌన్లను సీజ్ చేసిన అధికారులు. స్కూల్ లోగోలతో అధిక ధరలకు పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయిస్తున్నారంటూ విద్యార్థి సంఘాల భారీ ధర్నా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాల దందా.. తల్లిదండ్రుల నుంచి వేల రూపాయల దోపిడీవిద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం సాగుతోందంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం ఆందోళనలో పాల్గొన్న పీడీఎస్.యు, ఏఐఎస్ఏ, ఎంఎస్ఎఫ్, బిఎస్ఎఫ్(×) తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వార్షిక తనిఖీల్లో భాగంగా పెంచికల్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐ.పి.ఎస్.




ఆసిఫాబాద్ జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ మంగళవారం పెంచికల్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, సీడీ ఫైళ్లు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల వివరాలను ఎస్సై అనిల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు

# జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ




అమరావతి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): ప్రక్రియ విజయవాడ పార్లమెంట్ పరిధిలో రేపటి నుంచి ప్రారంభమవుతుంది. కావున పార్టీ కోసం మొదటి నుంచి ఇప్పటి వరకు ఎవరు అయితే పని చేసారో ఏ పదవి కావాలి అని కోరుకుంటున్నారో ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకోవలసినదిగా మనవి. దరఖాస్తులు స్వీకరించే తేదీ ఁ సమయం. ది. 30.06.2026 అనగా మంగళవారం ఉదయం 10.00 గం. నుంచి మధ్యాహ్నం 2.00 గం. ల వరకు. ది. 01.07.2026 అనగా బుధవారం ఉదయం 10.00 గం. నుంచి సాయంత్రం 6.00 గం. ల వరకు. ది. 02.07.2026 అనగా గురువారం ఉదయం 10.00 గం. నుంచి సాయంత్రం 6.00 గం. ల వరకు. ది. 03.07.2026 అనగా శుక్రవారం ఉదయం 10.00 గం. నుంచి సాయంత్రం 6.00 గం. ల వరకు. స్థలం: మంత్రి కందుల దుర్గేష్ గారి క్యాంప్ కార్యాలయం,ఎ.జూ.నగర్, బెంజ్ సర్కిల్ దగ్గర,విజయవాడలి



**తాడేపల్లి : జూన్ 30: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ గారిని కలిసిన సింగపూర్ కాన్సులేట్ జనరల్ (చెన్నై) ఎడ్గర్ పాంగ్‌తే చియాంగ్ .**

# వెనెజువెలాలో మళ్లీ భూకంపం.. భయంతో వీధుల్లో ప్రజలు



జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): వెనెజువెలాలో 4.6 నుంచి 5.1 తీవ్రతతో మరోసారి భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్లను వదిలి వీధుల్లోనే ఆశ్రయం పొందారు. గత వారం సంభవించిన భారీ భూకంపం వల్ల దెబ్బతిన్న భవనాల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సరిగ్గా మూడు రోజుల క్రితం వెనెజువెలా ఉత్తర-మధ్య ప్రాంతాన్ని 39 సెకన్ల వ్యవధిలో 7.2, 7.5 తీవ్రతతో కూడిన రెండు అత్యంత శక్తివంతమైన జంట భూకంపాలు వణికించిన సంగతి తెలిసిందే.

## శభాష్ పోలిసన్న అంటున్న పలువురు ప్రశంసలు




హైదరాబాద్: జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): తెలంగాణలో రాత్రి పెట్రోలింగ్ డ్యూటీకి వెళ్లే ముందు పోలీస్ కానిస్టేబుళ్లకు స్టేషన్ ఎస్ఐ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విధుల్లో క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇనస్తా పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ ముందుజాగ్రత్త చర్యపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే ఆదర్శంగా ఉండాలనే సందేశాన్ని ఈ చర్య తెలియజేస్తోంది

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య

**-నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించిన అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి**



అన్నమయ్య జిల్లా, మదనపల్లి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ప్రియుడుతో కలిసి భర్తను భార్యే హత్యచేసిన అమానవీయ ఘటన మదనపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. హత్య కేసులో నిందితుల అరెస్టు వివరాలను జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మీడియాకు వెల్లడించారు. మండలంలోని నారమాకుల తండాకు చెందిన బుక్య చిన్న బుడ్డన్ననాయక్(36) భార్య రమీల(30) అదే ఊరికి చెందిన రెడ్డప్ప నాయక్(40) తో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయమై భర్త భార్యను ఇటీవల మందలించడంతో ఈ నెల18న రాత్రి రుబ్బు రాయితో రమీల ఇంట్లో నిద్రపోతున్న భర్తను తలపై మోది హత్య చేసింది.

## రిటైర్డ్ పోలీసు అధికారులకు ఎస్పీ ఘన వీడ్కోలు



అన్నమయ్య జిల్లా, మదనపల్లి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, మంగళవారం మాట్లాడుతూ, అన్నమయ్య పోలీస్ శాఖలో సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ పొందిన అధికారులు నేటి తరానికి ఆదర్శనీయులని అన్నారు. జూన్ నెలాఖరుతో రిటైరైన ఏఎస్ఐలు బాషా, మోసెస్, హెడ్ కానిస్టేబుల్ మదన మోహన్ రెడ్డిలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. బాధితులకు ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామని, ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు

## 242 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కరీంనగర్ జిల్లా బ్యూరో: జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన 242 మంది లబ్ధిదారులకు సుమారు రూ.57.35 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంగళవారం పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

## జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా 296.31 కిలోల గంజాయి దహనం.

**-గంజాయి సాగు రవాణాపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా 2 సంవత్సరాల లో - 414 కేజీల గంజాయి , 2003 గంజాయి మొక్కల దహనం.**

**-- జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్**



ఆసిఫాబాద్ జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 57 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 296.31 కిలోల డ్రై గంజాయి, 964 గంజాయి మొక్కలను జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలను అనుసరించి, పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రమానాలను పాటిస్తూ ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. వీటి విలువ 1.70 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. గత ఏడాది 53 కేసులకు సంబంధించి 117.856 కిలోల గంజాయి, 1,039 గంజాయి మొక్కలను ఇదే విధానంలో దహనం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



అన్నమయ్య జిల్లా, మదనపల్లె/రాయచోటి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): రాయచోటి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరిగిన ఈ మాసవారీ తనిఖీలో గోదాము భద్రతను, బీయూ, సీయూ, వీవీ ప్యాట్ యంత్రాలను ఆయన తనిఖీ చేశారు. గోదాము వద్ద 24/7 నిరంతరం పటిష్టమైన పోలీస్ నిఘా ఉండాలని అధికారులను ఆదేశించారు. పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

## జిల్లా కోర్టుల వద్ద అంబులెన్స్ లు

అమరావతి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కోర్టుల వద్ద అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ కలిగిన ‘108’ అంబులెన్సు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కోర్టు వద్ద ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 13 జిల్లా కోర్టుల వద్ద అందుబాటులో ఉంచనున్న అంబులెన్సులకు ఏటా రూ.3.93 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలానే సీఆర్డీఏ పరిధిలోని రాయపూడి, ఐనవోలు, ఉండవల్లి వద్ద 3 కొత్త 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది

## కిడ్నీ వ్యాధిగ్రస్తులకుసంవత్సరానికి 5 లక్షలు

న్యూఢిల్లీ : జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను లోక్‌సభలో రూల్-377 కింద ప్రస్తావిస్తూ, వారికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రెడ్డి గారి విజ్ఞప్తికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా స్పందించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఆయుష్మాన్ భారత్ -- ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (ఆబీ-పీఎంజేఏ) పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సంవత్సరానికి ?5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందిస్తున్నట్లు పేర్కొంది. అలాగే హీమోడయాలసిస్, పెరిటోనియల్ డయాలసిస్, కిడ్నీ మార్పిడి (Kidney Transplant) చికిత్సలు కూడా ఈ పథకం పరిధిలో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పార్లమెంట్‌లో ప్రజల గొంతుకగా నిలుస్తూ, సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న నంద్యాల ఎంపీ **Dr Byreddy Shabari** గారికి అభినందనలు.

## ఎల్‌నినో సవాళ్లకు ప్రకృతి వ్యవసాయమే విరుగుడు.. కలెక్టర్ నిశాంత్ కుమార్



అన్నమయ్య జిల్లా, మదనపల్లి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు రైతులలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్నమండెం మండలం కేశాపురం గ్రామంలో పీఎండీఎస్, విత్తన పెల్లెటైజేషన్ విధానాలపై నిర్వహించిన క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను కలెక్టరు పరిశీలించారు. పంటల పరిస్థితిని పరిశీలించి, సాగు విధానం, నీటి వినియోగం, ఖర్చులు, దిగుబడులపై రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ నీటితోనూ మెరుగైన దిగుబడులు సాధించేందుకు ఈ విధానం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు వివరించారు. అనంతరం విత్తన పెల్లెటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. విత్తనాలకు సహజ పదార్థాలతో పూత పూయడం వల్ల మొలక శాతం పెరగడం, ప్రారంభ దశలో మొక్కల ఎదుగుదల మెరుగుపడడం, తేమ నిల్వ సామర్థ్యం పెరగడం, వేర్ల అభివృద్ధికి దోహదపడడం వంటి ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## జూలై 3 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ను విజయవంతం చేయండి.

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.**



వై ఎస్ ఆర్ కడప, జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): జిల్లా వాసుల చిరకాల స్వప్నం నెరవేర్చే దిశగా జిల్లా లోని జమ్మల మడుగు మండలం సున్నపు రాళ్ళ వద్ద జూలై 3 న స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ను విజయ వంతం చేసేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళ వారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు జూలై 03 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పై వివిధ శాఖల అధికారులకు విధుల కేటాయింపు సంబంధిత అంశాలకు సంబంధించి జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,జేసి డా.నిధి మీనా, నగర కమిషనర్ భావన,డి ఆర్ ఓ మల్లికార్జునుడు, ఏ ఎస్ పి ప్రకాష్ బాబు లతో కలసి దిశా నిర్దేశం చేశారు.

## లారీ చూడగానే పోలీసులకు డౌట్ వచ్చింది.. ఆపి చెక్ చేయగా.. మైండ్ బ్లాంక్ అయ్యే సీన్.



భద్రాచలం జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): ఓ భారీ కంటైనర్‌లో ఒక ప్రత్యేకమైన రూమ్ లాంటిది చేసి, అందులో ఏకంగా 500 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో చోటు చేసుకుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్, బూర్గంపాడు పోలీసులు సంయుక్తంగా చేసిన ఆపరేషన్‌లో కంటైనర్‌లో భారీగా తరలిస్తున్న గంజాయి పట్టుబడింది, కంటైనర్‌లో రహస్యంగా ఏర్పాటు చేసిన రూము లాంటి బాక్సులో 500 కేజీల గంజాయిని తరలిస్తున్నారు నిందితులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మారేడుమిల్లి నుండి ఉత్తరప్రదేశ్‌కు ఈ గంజాయి తరలిస్తున్నట్లుగా తెలిపారు పోలీసులు, ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు ఈగల్ టీం, పట్టుబడిన వారిలో ఓ మైనర్ కూడా ఉన్నారని, ఈ ఘటనకు సంబంధించి 8 మంది పై కేసు నమోదు చేశామని నలుగురు అదుపులో ఉండగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 10 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు

## కమలాపురం ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్ -- స్టాఫ్ నర్సుల మధ్య వాగ్వాదం



కమలాపురం జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని క్రాస్ రోడ్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సూపర్వైజర్ కొండారెడ్డి, స్టాఫ్ నర్సుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం, విధి నిర్వహణలో భాగంగా ఓ స్టాఫ్ నర్స్ వైద్యాధికారికి సమాచారం ఇచ్చి సెలవు తీసుకుని వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై సూపర్వైజర్ కొండారెడ్డి “ఎవరి అనుమతితో సెలవు తీసుకున్నారు?” అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన స్టాఫ్ నర్సులు, తాము వైద్యాధికారి అనుమతితోనే సెలవు తీసుకున్నామని తెలిపినప్పటికీ, సూపర్వైజర్ తమను బెదిరించే విధంగా మాట్లాడారని ఆరోపించారు. “నాకు రాజకీయ పలుకుబడి ఉంది, నేను పర్మినెంట్ ఉద్యోగిని, మీరు కాంట్రాక్ట్ ఉద్యోగులు” అంటూ తమను కించపరిచేలా, చిన్నచూపుతో మాట్లాడారని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రతి చిన్న విషయానికీ వివాదాలు సృష్టిస్తూ మహిళా సిబ్బందిని గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని, దీంతో విధులు ప్రశాంతంగా నిర్వహించలేకపోతున్నామని నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, బెదిరింపు ధోరణి ప్రదర్శించడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వారు తెలిపారు

## మల్లయ్య కొండ మైనింగ్ వివాదం.. ప్రభుత్వంపై పెద్దిరెడ్డి ఫైర్!



అన్నమయ్య జిల్లా, మదనపల్లి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లాలోని మల్లయ్య కొండలో మైనింగ్ వ్యవహారం రాజకీయ దుమారం రేపుతోంది. కూటమి ప్రభుత్వం పవిత్ర మల్లయ్య కొండలో ఇనుప ఖనిజం తవ్వకాలకు అనుమతులు ఇచ్చి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో మైనింగ్ అనుమతులు ఉన్నప్పటికీ భక్తుల మనోభావాలను గౌరవించి తవ్వకాలను నిలిపివేశామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సుమారు రూ.20 కోట్లతో రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎర్రకొండ, సాధుకొండ, శివపురం ప్రాంతాల్లో మైనింగ్‌కు టెండర్లు పిలిచి ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. మల్లయ్య కొండలో మైనింగ్ చేపడితే భక్తులతో కలిసి వైసీపీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పెద్దిరెడ్డి విమర్శించారు

## డ్రంక్ అండ్ డ్రైవ్‌కు గట్టి హెచ్చరిక.. రూ.10 వేల జరిమానాతో పాటు రెండ్రోజుల సమాజ సేవ



తిరుపతి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తికి తిరుపతి కోర్టు వినూత్న శిక్ష విధిస్తూ కఠిన హెచ్చరిక జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జి. చంద్రశేఖర్‌పై మోటారు వాహనాల చట్టం సెక్షన్--185 కింద నమోదైన కేసును విచారించిన తిరుపతి ద్వితీయ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు, నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో రూ.10 వేల జరిమానా విధించింది. అలాగే భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్--23 ప్రకారం రెండు రోజుల పాటు రేణిగుంట పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాలను శుభ్రం చేస్తూ సమాజ సేవ చేయాలని ఆదేశించింది. ఈ సేవను అర్బన్ సీఐ జయచంద్ర పర్యవేక్షణలో నిర్వహించాలని, జూలై 2లోగా ఫొటోలతో కూడిన నివేదికను కోర్టుకు సమర్పించాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## వైద్యుల దినోత్సవం సందర్భంగా జూలై 1న "హెల్తీ 5కే రన్" నిర్వహణ

పీలేరు, జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పీలేరు ఆధ్వర్యంలో జూలై 1, 2026 (బుధవారం) ఉదయం 6:00 గంటలకు కలికిరి క్రాస్ రోడ్స్‌లోని కపిలేశ్వర హాస్పిటల్ వద్ద "హెల్తీ 5ఖ రన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ప్రతిరోజూ వ్యాయామం, నడక, పరుగుల ప్రాముఖ్యతను తెలియజేయడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రన్ మార్గం

-ప్రారంభం: కలికిరి క్రాస్ రోడ్స్ (హైవే బ్రిడ్జి కింద)

-మధ్య మార్గం: జీమీఖూ కాలేజ్ బ్రిడ్జి కింద

-ముగింపు: కపిలేశ్వర హాస్పిటల్ (ప్రధాన భవనం ముందు)

కార్యక్రమ నిర్వాహకులు

-డా. ఆర్. రాజాసాహెబ్ -- అధ్యక్షులు, ×హీూ పీలేరు

-డా. చంద్రశేఖర్ నాయక్ -- కార్యదర్శి, ×హీూ పీలేరు

-డా. ఈశ్వర్ సురేంద్ర -- కోశాధికారి, ×హీూ పీలేరు

-డా. పి. చంద్రశేఖర్ -- వ్యవస్థాపక అధ్యక్షులు, **IMA** పీలేరు; మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, పీలేరు

-డా. శివ ప్రసాద్ సి.వి -- ఆర్గనైజింగ్ హెడ్

-డా. వై. పవన్ కుమార్ -- వ్యవస్థాపక కార్యదర్శి, **IMA** పీలేరు; మెడికల్ ఆఫీసర్, ప్రభుత్వ ఆసుపత్రి, కలికిరి... కలికిరి బృందం... డా. కె. లోకవర్ధన్, డా. హిమబిందు ఆర్. ఎం., డా. శివయోగి సోమశేఖర్, డా. షేక్ ఫర్వీన్, డా. షేక్ మహమ్మద్ వసీమ్, డా. షేక్ సిమ్రాన్. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజలందరూ ఈ 5ఖ రన్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు ఘన సన్మానం



రేణిగుంట జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): రేణిగుంట మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రావణ్ కుమార్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో రేణిగుంట గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నగేశం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నగేశం మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పరిపాలన అందిస్తూ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తే ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## రూ.2.50 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్



జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ పీడీఎస్ బియ్యాన్ని రేణిగుంట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు ఎస్సై శ్రీనివాసులు చెంగారెడ్డిపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్దనున్న వాహనం, గోదాములో కలిపి మొత్తం 226 బస్తాల్లో 11,120 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2.50 లక్షలు. శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తి ఆదేశాల మేరకు పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించేందుకు నిల్వ చేసినట్లు విచారణలో తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## లోకేష్ పర్యటనకు భారీ ఏర్పాట్లు.. కార్యకర్తలకే ప్రవేశం: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపాలెం సమీపంలోని సభా ప్రాంగణాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీగా సభా వేదికకు తీసుకువస్తామని చెప్పారు. అనంతరం ఉత్తమంగా పనిచేసిన సుమారు 210 మంది కార్యకర్తలను సన్మానించి, వారితో ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు పార్టీ కార్యకర్తలు అనేక ఇబ్బందులు, కేసులు, వేధింపులు ఎదుర్కొన్నప్పటికీ పార్టీని బలోపేతం చేశారని కొనియాడారు. కార్యకర్తలకు మరింత మనోధైర్యం కల్పించేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇది పూర్తిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యకర్తల కోసం మాత్రమే ఏర్పాటు చేసిన అంతర్గత సమావేశం అని, ముందుగా ఎంపిక చేసిన జాబితాలో ఉన్న సుమారు 1,500 మంది కార్యకర్తలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు సభకు రావద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశం అంతర్గత కార్యక్రమం కావడంతో మీడియాకు కూడా లోపల ప్రవేశం ఉండకపోవచ్చని, అవసరమైన ఫొటోలు, విజువల్స్‌ను పార్టీ తరపున అందజేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం లోకేష్ తిరుమలకు బయలుదేరనున్నట్లు వెల్లడించారు.






## అఖండ జ్యోతి ఊరేగింపు విజయవంతం



పీలేరు, జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య ఆశీస్సులతో పీలేరు భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సత్యసాయి దివ్య అఖండ జ్యోతి ఊరేగింపు ఉత్సవం మంగళవారం భక్తుల అపూర్వ స్పందన మధ్య ఘనంగా జరిగింది. పీలేరు క్రాస్ రోడ్డు నుండి ప్రారంభమైన అఖండ జ్యోతి ఊరేగింపు భజనలు, సాయి నామసంకీర్తనలు, వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. మార్గమధ్యంలో భక్తులు పూలతో స్వాగతం పలికి, హారతులు సమర్పించి, అఖండ జ్యోతిని దర్శించుకుని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులు పొందారు. మహిళలు, యువత, బాలవికాస్ విద్యార్థులు, సేవాదళ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభతో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ ఎస్. హరి ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు బాల సుబ్రమణ్యం, చెంగయ్య, మధు, నర్సింహులు, ఆనందాచారి, గురునాథ్ పాల్గొన్నారు. మహిళా విభాగం సేవకులు డా. నాగవేణి, షర్మిల, ఉదయశ్రీ, సునంద, స్వప్న, సుభాషిణి సేవలందించారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులు, సేవాదళ్ సభ్యులు, దాతలు, ప్రజాప్రతినిధులు, పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులు మరియు ప్రత్యక్ష--పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పీలేరు భజన మండలి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

## కురబలకోట రైల్వే స్టేషన్ వద్ద మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు క్షేత్రస్థాయి పరిశీలన

-అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై -- ప్రభుత్వానికి నివేదిక

- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



కురబలకోట, జూన్ 30 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లాలో రవాణా, నిల్వ, వ్యవసాయ ఉత్పత్తుల నిర్వహణకు అనుకూలంగా కురబలకోట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ (ఎంఎంఎల్పీ) ఏర్పాటు అవకాశాలపై సంబంధిత అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మదనపల్లి ప్రాంతానికి అనుకూలంగా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు గతంలో వివిధ ప్రాంతాలను పరిశీలించినప్పటికీ, ప్రస్తుతం కురబలకోట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతం అందుబాటులో ఉన్న భూమి, రవాణా సౌకర్యాలు, రైల్వే అనుసంధానం పరంగా అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జేసి తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. రైల్వే భూమిలో గిడ్డంగులు, లాజిస్టిక్స్ సదుపాయాలు, సివిల్ సప్లైస్ నిల్వ కేంద్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సదుపాయాల అభివృద్ధిపై చర్చించారు. అవసరమైతే అదనపు భూమి సేకరణ (ఎల్‌ఏ) ద్వారా ప్రాజెక్టుకు అవసరమైన భూభాగాన్ని సమకూర్చే అంశంపై కూడా జేసి అధికారులతో చర్చించారు. ప్రతిపాదిత లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులు, ధాన్యం నిల్వ, రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతో పాటు దూర ప్రాంతాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ముఖ్యంగా సివిల్ సప్లైస్, వ్యవసాయ రంగాలకు సంబంధించిన గిడ్డంగులు స్థానికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని జేసీ పేర్కొన్నారు. స్థల అవసరం, విస్తీర్ణం, రైల్వే అనుసంధానం, భూసేకరణ అవసరాలపై సంబంధిత శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆమోదం అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, తాసిల్దారు ధనుంజయలు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైల్వే శాఖ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614